నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, శుక్రవారం 10 మే 2024 SIDDIPET



కారు గుర్తుకు ఓటు వేయాలని డమ్మీ ఈవీఎంలో చూపుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



మర్కూక్: గులాబీ దళపతి కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎర్రవల్లి గ్రామస్తులు

# ముస్లింలకు మేలుచేసింది బీఆర్‌ఎస్సే

- కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్.. కాంగ్రెస్‌కు ఓటువేస్తే బీజేపీకి లాభం
- హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే హజ్‌హౌస్ నిర్మించుకున్నాం..
- ఎన్నికల తర్వాత బీజేపీ, కాంగ్రెసోళ్లు పత్తా ఉండరు..
- సిద్దిపేటలో ముస్లిం మైనార్టీల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

## కేసీఆర్ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు సంక్షేమం

సిద్దిపేట, మే 9: కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మైనార్టీలకు అన్నివిధాలుగా మేలు జరిగిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని కొండాభూదేవి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకట్రామిరెడ్డి చదువుకున్న వ్యక్తి అని, జిల్లా కలెక్టర్‌గా ప్రజలకు మంచిసేవ చేసిన వ్యక్తి అని, ఆయన గెలిపించుకుందామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఒకేపార్టీ వ్యక్తులు ఉంటే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. తెలంగాణలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేసిందని, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను 204 పెంచినట్లు గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికలు అయిపోయిగానే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మీకు అందుబాటులో ఉండరని, మళ్లీ మీకు అందుబాటులో ఉండేది తాను, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. హిందూ, ముస్లింలు రెండు కండ్లలాగా తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ వల్లనే సిద్దిపేటకు రైలు, నీళ్లు, 24 గంటల కరెంట్ వచ్చిందన్నారు. ఒకప్పుడు సిద్దిపేటలో తాగునీరు లేక పిల్లని ఇవ్వాలంటే భయపడ్డారన్నారు. అట్లాంటి సిద్దిపేటను నేడు ఏవిధంగా అభివృద్ధి చేశామో ఆలోచన చేయాలన్నారు. హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే హజ్‌హౌస్‌ను నిర్మించినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. తాను సొంతంగా ఏటా పదిమందిని ఉమ్రాకు పంపిస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేటలో 650 మంది మైనార్టీలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇచ్చామన్నారు.

**రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ పాలన**

నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతా రివర్స్ గేర్‌లో నడుస్తున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి 12 మంది మంత్రుల్లో ఒక్క ముస్లిం మైనార్టీకి స్థానం కల్పించలేదన్నారు. సిద్దిపేటలో శ్మశాన వాటిక కోసం తాను తన సొంత డబ్బులతో పట్టణ శివారులో మూడెకరాల భూమిని కొని, బోరు వేసి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటు బిగించి ఇచ్చినట్లు హరీశ్‌రావు చెప్పారు. రంజాన్ పండుగ వస్తే తాను వచ్చి అందరినీ కలిసి శుభాకాంక్షలు తెలిపానన్నారు. రంజాన్ పండుగకు దాతల సహకారంతో పాటు తన సొంత డబ్బులతో వేలాది మంది ముస్లిం నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశానని గుర్తుచేశారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగే కేసీఆర్ రోడ్‌షోకు ప్రతిఒక్కరూ వచ్చి ఆశీర్వాదం ఇవ్వాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫక్రుద్దీన్, నాయకులు పూజలు వెంకటేశ్వరరావు, పాల సాయిరాం, కౌన్సిలర్లు అత్తర్ పటేల్, వజీరుద్దీన్, మోయిజ్, కల్వకుంట్ల మల్లికార్జున్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్, జావిద్, వహీద్, అక్బర్ నవాజ్, జమ్ముఖాన్, అతిక్, ఖాజా మొహినుద్దీన్, బాబుజానీ, అజీజ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ముస్లిం మైనార్టీలు

# జనహృదయ నేతకు ఘన స్వాగతం

కొండపాక(కుకునూరుపల్లి), మే 9: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కుకునూరుపల్లి, కొండపాక మండలంలోని దుద్దెడ వరకు రహదారి పొడవునా బీఆర్‌ఎస్ నాయకులు, కేసీఆర్ అభిమానులు ఘనస్వాగతం పలికారు. జనహృదయ నేతను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో కేసీఆర్‌కు హారతి పట్టారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కుమార్‌యాదవ్, రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ దుర్గయ్య పాల్గొన్నారు.

**గులాబీ పూలతో..**

మర్కూక్, మే 9: ఎర్రవల్లి గ్రామస్తులు కేసీఆర్‌కు గులాబీ పూలతో స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తన వ్యవసాయం క్షేత్రం నుంచి కరీంనగర్‌కు బయలుదేరిన గులాబీ దళపతి కేసీఆర్‌కు దత్తతగ్రామమైన ఎర్రవల్లి గ్రామస్తులు గులాబీ పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు బాల్‌రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తోటపల్లి వద్ద...**

బెజ్జంకి, మే 9: కరీంనగర్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు మండలంలోని తోటపల్లి వద్ద ప్రజలు ఘనస్వాగతం పలికారు., కేసీఆర్ బస్సును ఆపి ప్రజలకు అభివాదం చేశారు. నాయకులు బస్సు ఎదుట గుమ్మడికాయ కొట్టగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్, శ్రీనివాస్ గుప్తా, తిరుపతి ఉన్నారు.



కుకునూరుపల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు




రంగధాంపల్లి చౌరస్తా వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

**రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద..**

సిద్దిపేట అర్బన్, మే 9: కరీంనగర్ రోడ్‌షోకు వెళ్తున్న కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గురువారం కరీంనగర్ వెళ్తున్న కేసీఆర్‌కు సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సుపై పూలు చల్లుతూ.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ బస్సులో నుంచి బీఆర్‌ఎస్ నాయకులకు అభివాదం చేశారు. కొంతమంది బీఆర్‌ఎస్ యువజన నాయకులు బస్సులోకెళ్లి కేసీఆర్‌కు దట్టీ కట్టి సెల్ఫీలు దిగారు. పెద్దఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్దకు రావడంతో బస్సు కదిలేందుకు సుమారు అరగంట సమయం పట్టింది.

# చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తాం



సిద్దిపేట జిల్లా చేర్యాలలో నిర్వహించిన భారీ ర్యాలీకి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

- చేర్యాల గడ్డ.. ఉద్యమాలకు అడ్డా
- అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- చేర్యాల రోడ్‌షోలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ రోడ్ షోకు పోటెత్తిన జనం
- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కబ్జాకోరు: భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం



చేర్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం

చేర్యాల, మే 9: చేర్యాల గడ్డ ఉద్యమాలకు అడ్డా అని, ఈ ప్రాంత ప్రజలు ఓటుతో కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి చేర్యాల పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారు చెరువులు నింపకపోవడంతో రైతుల పంటలు ఎండిపోయాయని, నియోజకవర్గంలోని రిజర్వాయర్లు, చెరువులు ఎండబెట్టి రైతుల నోట్లో మట్టికొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాల, జనగామ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సొంత దవాఖానలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని, దొంగ ఓట్లతో గెలిచానని కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి అంటున్నాడని, నియోజకవర్గంలో ఎక్కడ దొంగ ఓట్లు వేయలేదని ప్రజలు చెబుతున్నారని, మరి దొంగ ఓట్లు ఎవరు వేశారో ఎక్కడ వేశారో కాంగ్రెసోళ్లకు తెలియాలన్నారు. అసెంబ్లీలో తనకు వచ్చిన మొదటి అవకాశంలోనే చేర్యాల రెవెన్యూ డివిజన్ గురించి ప్రస్తావించానని, అధికారం రాకముందు ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్న చాలామంది నాయకులు అధికారం రాగానే రెవెన్యూ డివిజన్ మర్చిపోయారన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ చేసే వరకు విశ్రమించేది లేదని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అక్కున చేర్చుకుని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**ఢిల్లీ కమిషన్ల కోసమే రైతుబంధు డబ్బులు: క్యామ మల్లేశం**

రాహుల్‌గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాకుండా ఆదిభట్లలో ప్లాట్లు ఆక్రమించిన భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ కబ్జాకోరని బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ఆరోపించారు. కేసీఆర్ ఎంపీ టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించారని, బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అత్యధిక జనాభా ఉన్న గౌడ, మాదిగ, గొల్లకురుమలకు కాంగ్రెస్ ఒక్క టికెట్ ఇవ్వలేదని, ఎన్నికల సమయంలో పార్టీ మారిన దొంగలకు టికెట్లు ఇచ్చారని విమర్శించారు. బీజేపోళ్లు రైస్‌మిల్లు నుంచి బియ్యం తెచ్చి అక్షింతలు కలిపి ప్రజలను మోసం చేస్తున్నారని, వారిని నమ్మొద్దన్నారు. కేసీఆర్ యాదాద్రి నిర్మించి ఏనాడు రాజకీయాల కోసం నర్సింహస్వామిని వాడుకోలేదన్నారు. భువనగిరి ఎంపీలుగా పనిచేసిన కోమటిరెడ్డి బ్రదర్స్, బూరనర్సయ్య ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సామాన్య కుటుంబానికి చెందిన తనను ఆదరిస్తే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఈ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తానని క్యామ మల్లేశ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రోడ్ షో గ్రాండ్ సక్సెస్**

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాలలో నిర్వహించిన రోడ్‌షో గ్రాండ్ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. చేర్యాల పట్టణం ప్రజలతో పాటు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీగా రోడ్‌షోకు తరలివచ్చారు. కొమురవెల్లి నుంచి ప్రారంభమైన రోడ్‌షో చేర్యాల పట్టణం నుంచి పట్టణ శివారు ముస్త్యాల వరకు కొనసాగింది. రోడ్ షోకు సుమారు 10వేల మంది తరలివచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రోడ్డు పొడవునా మహిళలు మంగళహారతులు, యువకులు పటాకులు కాల్చి సందడి చేశారు.

చేర్యాల రోడ్‌షోకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు





సంగారెడ్డిలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

# కాంగ్రెస్ వచ్చి కష్టాలు తెచ్చింది

- రివర్స్‌గేర్‌లో కాంగ్రెస్ పాలన
- బీజేపీ, కాంగ్రెస్‌లతో మనకు ఒరిగిందేమీ లేదు...
- కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నడూ కరువు లేదు
- బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి
- ప్రజా సేవకుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్‌షో



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి విద్యుత్ నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సత్యనారాయణ

రామచంద్రాపురం, మే 9: పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ కరువు రాలేదని, రైతులు, ప్రజలు ఎలాంటి కష్టాలు లేకుండా సంతోషంగా జీవించారని, ఇప్పుడు కాంగ్రెస్ వచ్చి, కరువు, కష్టాలు తెచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రోడ్‌షోకు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే కరెంటు, నీళ్ల కష్టాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ రాగానే కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, తులం బంగారం బంద్ అయిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందన్నారు. ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇస్తామని ఒక్క గ్యారెంటీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు రూ. 2,500 ఇస్తామని మోసం చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం పదేండ్లలో ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. విదేశీ మార్కెట్‌లో క్రూడాయిల్ తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, గ్యాస్ ధర రూ.1200 లకు పెంచారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీని నమ్ముకుంటే మనకు ఒరిగేది ఏమి ఉండదన్నారు. దేశంలో ఏ సీఎం కట్టని విధంగా రూ.వెయ్యి కోట్లతో కేసీఆర్ యాదాద్రి ఆలయాన్ని నిర్మించారని గుర్తుచేశారు. శతచండీ యాగాన్ని చేశారని చెప్పారు. దేవుళ్ల పేరు చెప్పి కేసీఆర్ ఎప్పుడు రాజకీయాలు చేయలేదన్నారు. ఆలయాలను అభివృద్ధి, దేవుళ్లకు ధూపదీప నైవేద్యాలకు నిధులు ఇచ్చిన హిందూవాది కేసీఆర్ అని అన్నారు. తెల్లాపూర్‌లో మున్సిపల్ భవనం, మార్కెట్ యార్డ్, దేవాలయాలు, తదితర అభివృద్ధి పనులకు రూ.500 కోట్లు విలువ చేసే భూమిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సీఎం హోదాలో కేసీఆర్ తెల్లాపూర్‌కి మంజూరు చేసిన రూ.50కోట్లు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే వెనక్కి తీసుకుందని చెప్పారు.13వ తేదీన జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. అనంతరం మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, శంకర్‌యాదవ్, మల్లారెడ్డి, బాబ్జీ, లచ్చిరాం, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, బుచ్చిరెడ్డి, శ్రీశైలం, శ్రీపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, అజీమ్, నర్సింహులు, నర్సింహ, బాలయ్య, యాదగిరి, సత్యనారాయణ, ప్రభాకర్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

తెల్లాపూర్ విద్యుత్ నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు



## అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

– సంగారెడ్డి రోడ్‌షోలో హరీశ్‌రావు

సంగారెడ్డి, మే 9(నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీలు అమలుచేయకుండా మోసం చేస్తున్న అబద్ధాల కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డిలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాత్రం అన్ని హామీలు అమలు చేశామని అబద్ధాలు చెప్పటం విడ్డూరంగా ఉన్నదన్నారు. మహిళలకు రూ.2500 ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి అమలు చేయకుండానే రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో మహిళల పేరిట బ్యాంకుల్లో ప్రతినెలా రూ.8500 జమచేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి మాటలను జనం నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్న బీఆర్‌ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పక్కా లోకల్ అని, రిటైర్డు ఐఏఎస్ అధికారిగా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశారని తెలిపారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల గొంతుక అవుతానని తెలిపారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గం నుంచి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ ఇచ్చి గెలిపిస్తామని తెలిపారు.